కథ

పి.సుభాషిణి

# మనసు చూడతరమా!

సినిమా విజయోత్సవ యాత్ర మా జిల్లాకు చేరుకుంది.

అదే మా చివరి మజిలీ. అక్కడ నుండి మా యూనిట్ హైదరాబాద్‌కి తిరుగు ప్రయాణం అవుతుంది. అందుకే సినిమా ఆడుతున్న థియేటర్‌లోని ప్రేక్షకులను కలిశాక హీరో, ప్రొడ్యూసర్స్‌తో చెప్పేశాను. "నేనిటు నుండి మా ఊరెళ్తాను."

"ఫిఫ్టీడేస్ ఫంక్షన్ ఏర్పాట్లు ప్రారంభించాలి. వీలయినంత త్వరగా తిరిగొచ్చేయ్ శ్రీనివాస్" చెప్పాడు ప్రొడ్యూసర్ కనకారావు.

"అలాగే" తలూపాను.

నా కారులో ఆ రాత్రికే మా ఊరు చేరుకున్నాను.

నన్ను చూసి అమ్మ పొంగిపోయింది. నాన్న గట్టిగా కౌగిలించేసుకుని 'నా గురించి ఊరి జనం అనుకుంటున్న మాటలు' చెప్పడం మొదలుపెట్టాడు.

"శీనూ! నీ సినిమా రికార్డులు బద్దలుకొడుతుందంటున్నారురా! హీరో 'రామూ' సినిమాలన్నింటిలో ఇదే పెద్ద హిట్టట కదా?! సినిమా ముప్పై కోట్లు వసూలు చేస్తుందంటున్నారు.. మనూరోళ్లయితే థియేటర్ల దగ్గర అల్లరల్లరి చేసేస్తున్నారు. 'ఈ సినిమా డైరెక్టర్‌ది మా ఊరే' అని గర్వంగా చెపుతున్నారు. నీ నెక్స్ట్ సినిమాకి మనూళ్లో కటౌట్స్ పెట్టాలని, నీకు అభిమాన సంఘాలు పెట్టాలని ఇప్పటి నుండే ప్లాన్ చేసుకుంటున్నారు....."

నేను నవ్వి ఊరుకున్నాను.

మేం ముగ్గురం అలా మాట్లాడుకుంటుండగానే, మా ఇంటి ముందు కారు ఆగడంతో నా రాక గురించి తెలిసిపోయిందేమో, మిత్రుల రాక మొదలయ్యింది. ఒక్కొక్కరూ వచ్చి నన్ను అభినందిస్తున్నారు. వారిలో నా చిన్ననాటి స్నేహితులు, బంధువులూ ఉన్నారు.

అర్ధరాత్రి వరకూ వాళ్లు నన్ను వదల్లేదు. అప్పటికీ నా ఆవులింతలు చూసి ఇక తప్పదన్నట్టుగా వెళ్లిపోయారు.

సినిమా విడుదలయ్యాక మొదటిసారిగా పుట్టిన ఊరు వచ్చాను. 'ఒక గొప్ప సక్సెస్ సాధించిన ఆనందం కన్నా, నా సక్సెస్‌ని నా ఊరి జనం ఎంతగా ఆస్వాదిస్తున్నారో' చూసి ఉబ్బితబ్బిబ్బైపోయాను.

ఆ భావోద్వేగం ఆ రాత్రి నన్ను నిద్రపోనివ్వడం లేదు.

ఐతే ఆ భావోద్వేగాన్ని మించి 'ఆమె' తాలూకూ ఆలోచనలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. 'నా సక్సెస్ గురించి వనజకు తెలుసా? ఆమె నా గురించి ఏమనుకుంటోంది?...ఇది తెలుసుకోవడం ఎలా?...'

ఆ విషయంలో నేను కష్టపడకుండానే అవకాశం వెతుక్కుంటూ వచ్చింది.

మర్నాడు ఉదయం నాన్న పొలం నుండి వస్తూనే చెప్పాడు. "శీనూ! సుధాకరయ్యగారు ఈ మధ్యాహ్నం భోజనానికి రమ్మంటున్నారురా"

ఆ ఆహ్వానం వినగానే థ్రిల్ ఫీలయినా, ఆ భావం ముఖంలో కనిపించకుండా అడిగాను "ఎందుకూ?"

"మనూరివాడు పెద్ద సినిమా డైరెక్టరయితే, ఊరి సర్పంచ్‌గా కనీసం భోజనం పెట్టడం నా బాధ్యత" అంటున్నారాయన.

ఆయన ఏ ఉద్దేశ్యంతో పిలిచినా, నాకు కావల్సింది ఆ ఇంటికి వెళ్లడమే! అందుకే "సరే నాన్న! మధ్యాహ్నం వెళ్దాంలే" అన్నాను.

కానీ 'ఆ మధ్యాహ్నం ఎప్పుడొస్తుందా' అని ఆ క్షణం నుండే ఎదురుచూడడం మొదలుపెట్టాను. మధ్యాహ్నం నేను, నాన్నగారు సర్పంచ్ ఇంటికెళ్లాము.

సుధాకరయ్య ఊరికి మోతుబరి రైతు మాత్రమే కాదు, పాతికేళ్లుగా గ్రామ సర్పంచ్‌గా కూడా మంచి పేరే తెచ్చుకున్నారు.

అర ఎకరం స్థలంలో రాజభవనంలా ఉంటుందా ఇల్లు! స్కూల్‌కెళ్లేటప్పుడు ఆ ఇంటికేసి ఆశ్చర్యంగా, అటునిటు తిరుగాడే ఆ ఇంటి యజమాని సుధాకరయ్య కేసి భయంగా చూసేవాళ్లం. కానీ ఆ ఇంట పుట్టిన ముద్దుగుమ్మ వనజ మా స్కూలులో చేరాక నా ఆలోచనలు మారాయి. ఆ ఇంటితో ఏదో తెలియని అనుభవం ఉందని అనిపించేది. భవిష్యత్‌లో ఆ ఇల్లే నా ఇల్లు అన్న ఆలోచన కలిగేది. దాంతో కలలు కనడం ప్రారంభమయ్యింది.

అలా నన్ను కలల ప్రపంచంలోకి తీసుకెళ్లిన ఆ ఇంటిలోకి అడుగు పెట్టడం అదే మొదటిసారి. అదొక అపురూపమైన అనుభూతి!

సుధాకరయ్యే కాదు, ఆయన భార్య సుగుణమ్మ వరండాలో నా కోసమే ఎదురుచూస్తున్నారు. నేను ఆ ఇంటికి రాబోతున్నానని తెలిసినట్టుంది. వారి బంధువులు, ఇరుగుపొరుగు హాల్లో కనిపించారు. సినిమా గ్లామర్ అలాంటిది. హీరోలనే కాదు, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్లనూ చూడడానికి జనం ఎగబడుతున్నారు.

ఐతే అంత ఆనందంలోనూ నాలో చిన్న అసంతృప్తి. నేను ఎవరి కోసమైతే ఆ ఇంటికి వచ్చానో ఆ వ్యక్తి మాత్రం ఇంకా కనిపించలేదు.

సుధాకరయ్యగారే ఎదురొచ్చి నా భుజం మీద చెయ్యేసి లోపలికి తీసుకెళ్తూ "రావయ్యా శ్రీనివాస్! నిన్నెప్పుడో చిన్నప్పుడు చూశాను. మనూరు నుండి నువ్వు సినిమా ఇండస్ట్రీకి వెళ్లావని తెలిసి, ఏమవుతాడో పాపం అనుకున్నాను. కానీ ఈ రోజు నువ్వు చాలా గొప్పవాడివైపోయావ్. మనూరికే పేరు తెచ్చావ్" పలికాడు.

నేను నవ్వి ఊరుకున్నాను.

అందరం లోపలికెళ్లాము. నాకు అంతగా పరిచయం లేని కుర్రాళ్లు హాలులో నిలబడితే ఆడాళ్లు పక్క గదుల్లోకి వెళ్లి తొంగి చూడసాగారు.

నా కళ్లు మరోసారి వనజ కోసం వెతికాయి... ఊహూ! కనిపించలేదు. "ఒకవేళ ఆమె ఎక్కడికైనా వెళ్లిందా?"

సుధాకరయ్య నాతో మాటలు కలిపారు. అందరికున్నట్లే ఆయనకూ సినిమా ఇండస్ట్రీ మీద చాలా ఆసక్తి ఉన్నట్టుంది.

"నెక్స్ట్ సినిమా ఎవరితో చేస్తున్నావ్?"

పేరు చెప్పాను. అంత పెద్ద హీరోతో నా సెకండ్ ప్రాజెక్టు ఉందని తెలియగానే వారి ముఖాలలో ఆశ్చర్యం! యాభై ఏళ్ల నంబర్‌వన్ హీరోని ఈ ముప్పై యేళ్ల కుర్రాడు డైరెక్ట్ చేయడమా?

ఆయన క్యూరియాసిటీగానే అడిగాడు. "ఆ సినిమా డైరెక్ట్ చేయడానికి ఎంత తీసుకుంటున్నావేంటి?"

"రెండు కోట్లు"


అపనమ్మకంగా నా వైపు చూశారాయన.

అది గమనించినట్టు మా నాన్న అందుకున్నారు. "వారం క్రితమే యాభై లక్షలు బ్యాంకులో వేశాడు. సినిమా ప్రారంభం రోజున మరో యాభై లక్షలు, సినిమా రిలీజ్‌కి ముందు కోటి రూపాయలు ఇచ్చేట్టు ఒప్పందం కుదిరింది"

"అంటే... ఒక్క సినిమాతోనే ఈ ఊళ్లో అందరి కన్నా ధనికుడైపోయాడన్న మాట. ఇంకేంటి, ఈ ఊళ్లో పొలాల రేట్లు బాగా పెరిగిపోతాయి" నన్ను చూసి ఆయన ఆప్యాయంగా నవ్వారు.

హీరో, హీరోయిన్ల రెమ్యూనరేషన్ వివరాలు, ఆ హీరో కలుస్తాడా, ఈ హీరోయిన్ ఎలాంటిది? లాంటి ప్రశ్నలకు అనాసక్తంగా జవాబు చెపుతూనే, చుట్టూ పరిశీలిస్తూ ఉన్నాను. ఒక్కసారిగా నా కళ్లు ఆగాయి. అవి విస్ఫారితాలయ్యాయి.

వనజ కిటికీ అవతల నిలబడి ఉంది. నన్ను చూడ



గానే ఆమె ముఖంలో సరికొత్త కాంతి కదలాడడం తెలిసిపోతూనే ఉన్నా బొట్టు లేని నుదురు జరిగిపోయిన కథను చెప్పకనే చెపుతోంది.

చాలా సంవత్సరాల తర్వాత ఆమెను చూసిన ఆనందం ఒకవైపు, తన పరిస్థితి తెలిసిన తర్వాత కలిగిన బాధ మరోవైపు నా హృదయం భిన్నభావాల మధ్య కొట్టుకులాడింది.

అప్పుడే నా మనసు చిన్ననాటి స్మృతులను మరోసారి నెమరువేసుకుంది.

○○○

వనజ ఏడవ తరగతి వరకూ టౌన్‌లో ఇంగ్లీష్ మీడియంలో చదివింది. హైస్కూల్‌కి వచ్చాక మా ఊళ్లో మా స్కూల్‌లో చేరింది.

ఆమెది మా ఊరే అయినప్పటికీ క్లాసులోనే నేను తనను మొదటిసారి చూడడం. తెలిసీ తెలియని ఆ వయసులో ఏదో తెలియని ఆహ్లాదకర భావం! తనతో మాట్లాడాలని, స్నేహం చేయాలని... నేను మాత్రమే కాదు. మా క్లాసులో మరో ఇద్దరు ముగ్గురు కూడా ప్రయత్నించేవారు. ఎప్పుడో ఏదో అవసరపడితే ముక్తసరిగా మాట్లాడ్డం జరిగేది. అలా మూడేళ్లు గడిచిపోయాయి. స్కూల్ లైఫ్ దాటి కాలేజీ జీవితంలో ప్రవేశించాము.

టౌన్‌కి, మా ఊరికి మధ్య దూరం పది కిలోమీటర్లే. కాలేజీకి రోజూ బస్సులో ప్రయాణం. ఐతే టౌన్‌లో ఆమెది ఉమెన్స్ కాలేజీ. నాది కో ఎడ్యుకేషన్ కాలేజీ. కానీ స్కూలులో క్లాస్‌మేట్స్ కావడంతో, బస్సులో పలకరింపులుండేవి. ఒక్కోరోజు నేను ఆమె బస్సు ఎక్కే స్టాప్ దగ్గరికే వెళ్లిపోయేవాడిని.

"ఇలా వచ్చావేం శ్రీనివాస్?" అని ఆమె అడిగేది.

"ఇక్కడ దగ్గర్లో ఫ్రెండ్ ఉన్నాడు. అతడి కోసం వచ్చాను" అంటూ అబద్ధం చెప్పేవాడిని. ఆ అబద్ధం ఆమె నమ్మేదో, లేదో నాకు తెలియదు.

సీనియర్ ఇంటర్ పరీక్షల ముందు ఓ రోజు అలా కలిసినప్పుడే ఆమె చెప్పింది. "శీనూ! నాకు పెళ్లి ఫిక్సయ్యింది తెలుసా?"

నేను షాక్ తిన్నట్టు ఆమెవైపు చూశాను.

ఎంతసేపటికీ నేను మాట్లాడకపోయేసరికి ఆమే అంది. "వచ్చే నెలలో నిశ్చయతాంబూలాలు. ఎగ్జామ్స్ అయిపోయాక పెళ్లి."

అప్పటికి ఆమెకు పద్దెనిమిదేళ్లు వస్తాయి. పద్దెనిమిదో ఏటనే పెళ్లి. ఇప్పుడు నా వయసు అదే.

నా మనసులో ఒక్కసారిగా బాధ, కోపం, కసి, మరెన్నో భావాలు సమ్మిళితమై పిచ్చిపట్టేలా చేశాయి. 'ఇదిగో... ఈ క్షణమైనా నేను నా మనసులోని ఫీలింగ్ని ఆమె ముందు పెట్టకపోతే... ఇక జీవితాంతం బాధపడుతూనే ఉంటాను.'

అందుకే పెదవి విప్పాను. "వనజా! నేను... నేను నిన్ను..."

ఆపమన్నట్టుగా ఆమె చెయ్యి చూపించింది. నా మనసులోని మాటలు బయటపెట్టకుండానే ఆగాను.

"..... నేను నిన్ను ప్రేమిస్తున్నాను అంటావ్. అంతేగా నువ్వు చెప్పబోయేది"

షాక్‌మీద షాక్ తగిలినట్టు ఆమెనే చూస్తుండిపోయాను.

వనజ పది క్షణాలాగి కంటిన్యూ చేసింది. ".... చూడు శీనూ! మనది పద్దెనిమిదేళ్ల వయసు. ఈ వయసులో నువ్వు ప్రేమ అనగానే, నేను మనసు మార్చుకుని నీ వెంట వచ్చేస్తే దాని వలన ఎన్ని సమస్యలు, మరెన్ని ఇబ్బందులు ఎదురవుతాయో ఆలోచించు. మన రెండు కుటుంబాల మధ్య గొడవలొస్తాయి. ఇల్లొదిలి వెళ్లిన మనం బ్రతకడానికి ఎన్నెన్నో కష్టాలు పడాలి. అసలు జీవితం గురించి, మనసు గురించి ఆలోచించేంత వయసు మనకుందా? ప్రాక్టికల్‌గా ఆలోచించు. పద్దెనిమిదేళ్ల ఈ చిన్న వయసులో మనం జీవితాలనే మార్చే నిర్ణయం తీసుకోవడం మంచిది కాదు. అదే నా అభిప్రాయం."

బస్సొచ్చింది. ఆమె బస్సెక్కింది.


అమెను తీసుకుని బస్సు వెళ్లిపోయింది.

నేను అక్కడే ఆగిపోయాను.

ooo

ఆ తర్వాత ఆమెను చూడడం ఇదిగో....ఇప్పుడే! అదీ పన్నెండేళ్ల తర్వాత.....

ఈ పన్నెండేళ్లలో నేను ఎంతో మారాను. జీవితం గురించి, మనసు గురించి ఎంతో తెలుసుకున్నాను. 'ప్రేమించే మనసు' ఎలా ఉంటుందో చెపుతూ, కథ, మాటలు రాసుకుని నేనే దర్శకత్వం వహించిన సినిమా నేడు ఆంధ్ర రాష్ట్రాన్ని ఊపేస్తోంది.




మరి నాకిప్పుడు ప్రేమ గురించి మాట్లాడే అర్హత, మనసును అర్థం చేసుకునే స్థాయి వచ్చాయనే అనుకుంటున్నాను.

మాటల మధ్యనే భోజనాలయ్యాయి.

భోజనాల సమయంలో వనజ మా మధ్యకు వచ్చింది. ఆమే వడ్డించింది.

సుధాకరయ్యకు అప్పుడే గుర్తుకొచ్చినట్టుంది. "అవునూ! మీరిద్దరూ క్లాస్‌మేట్స్ కదూ?" మా ఇద్దరికేసి మార్చి చూశాడు.

"అవును చాలా సంవత్సరాల తర్వాత చూశాను... అందుకే వనజతో కాసేపు మాట్లాడి వెళ్లాలని అనుకుంటున్నాను."

సుధాకరయ్య కుటుంబమే కాదు, మా నాన్న కూడా నాకేసి అదోలా చూశాడు. అదే క్షణం ఆమె ఉలికిపడడం నాకు స్పష్టంగా తెలిసిపోయింది.

అంతలోనే తేరుకుని "ఒహో! చిన్ననాటి స్నేహితులు కదా? కాసేపు చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటారేమో" అని నవ్వేశారు సుధాకరయ్య. ఆ మాటల్లోనే అంగీకారమూ ఉంది.

భోజనాలయ్యాక వనజ మెల్లగా పెరడువైపు నడిచింది. నేనూ ఆమెను అనుసరించాను.


పెరట్లోని వేపచెట్టు కింద ఆమె నిలబడింది. నేను ఆమెకు పదడుగుల దూరంలో నిలిచి "ఎలా ఉన్నారు?" అన్నాను.

"ఇలా..." అంటూ నవ్వింది. ఆ నవ్వులో జీవం లేదు.

"మరి నా గురించి తెలుసా? నేను ఈ రోజు సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌ని. 'ప్రేమ' కథతో నేను తీసిన సినిమా సూపర్‌హిట్టయ్యింది. మనసు గురించి నేను రాసిన మాటలకు జనం చప్పట్లు కొడుతున్నారు.. నా ఉద్దేశ్యం... నాకిప్పుడు ప్రేమ గురించి, మనసు గురించి మాట్లాడే వయసు, అర్హత వచ్చాయనేగా.." నేను ఆమె ముఖంలోకి చూస్తున్నాను.

"కావచ్చు" ఆమె నేల మీద కాలి బొటనవ్రేలితో పిచ్చిగీతలు గీస్తోంది.

"అలాగే నేనిప్పుడు ఏదైనా నిర్ణయం తీసుకుంటే, నా కుటుంబ సభ్యులు కాస్త బాధపడొచ్చుగానీ, రెండు కుటుంబాల మధ్య గొడవలు రావనుకుంటాను?"



ఒక్క క్షణం... నేను టాపిక్‌ని ఎటువైపు తీసుకెళ్తున్నానో అర్థమయిందేమో.... ఆమె ఉలిక్కిపడి తలెత్తి నా ముఖంలోకి చూసింది. "అంటే.....మీ... ఉద్దేశ్యం?...." చాలాసేపటి తర్వాత గొంతు పెగిలించుకుని ప్రశ్నించింది.

"నేను ప్రశ్నించాను. నాకు జవాబు కావాలి. ప్రశ్నకు ప్రశ్న జవాబు కాదు."

ఆమె నా ముఖంలోకే పరిశీలనగా చూస్తూ అంది. "మీ నిర్ణయం ఏమిటో తెలియకుండా కుటుంబాల మధ్య గొడవలు రావని నేనెలా హామీ ఇవ్వగలను?"

"నా మనసు అర్థమయినా అర్థం కానట్టుగా నటించడం వల్లనే మీరీ ప్రశ్న వేస్తున్నారు... సరే! అది.. మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలన్నదే నా నిర్ణయం అనుకుంటే....?!...."

ఆమె నా స్థాయిని గుర్తించింది కాబట్టే, నా నోటనే ఆ మాట పలికించిందని తెలుసు.


## గులాబి ప్రేమ

*గులాబీ పువ్వుని పట్టుకోవాలంటే జాగ్రత్తగా ముళ్లు గుచ్చుకోకుండా ఎలా పట్టుకుంటామో ఎవర్నైనా ప్రేమించాలంటే ఇలాగే జాగ్రత్తగా అడుగు ముందుకేయాలి అంటోంది నయనతార. శింబుతో ప్రేమ బెడిసికొట్టాక నయనతారలో ఎంతో మార్పు వచ్చిందని ఆమె సన్నిహితులు చెప్తారు. అందుకు నిదర్శనం అన్నట్టుగా నయనతార ఇలాంటి వేదాంతాలను మాట్లాడుతోందిప్పుడు. ఒకసారి తెలియక తప్పు చేసాను, ఇక మళ్లీ అలాంటి తప్పులు ఎలా చేస్తాను అంటోంది కొత్త ప్రేమల గురించి సమాచారం ఏమైనా వుందా అని అడిగే వాళ్లకి.*

ఇక ఆమె నుండి జవాబు రావాలి. ఆ జవాబు నాకు అనుకూలంగా ఉంటుందనే అనుకుంటున్నాను.

వనజ కొద్ది క్షణాలు కన్నులు మూసుకుంది. ఆమె తన మనసు లోతుల్లోకి తొంగి చూసుకుంటుందనే అనుకున్నాను.

ఆమె కళ్లు తెరిచింది. నవ్వుతూ నాకేసి చూసింది. "శ్రీనూ!..." అంది ఆప్యాయంగా. నాకు నా చిన్ననాటి స్నేహితురాలు వనజ మరోసారి కళ్ల ముందు కదలాడింది. అదే క్షణం ఆమె మాటలు కంటిన్యూ అయ్యాయి.



"..... పన్నెండేళ్ల క్రితం నువ్వు ఇదే ప్రపోజల్ నా ముందు ఉంచావు. అప్పుడు నా నిర్ణయం నీకు వ్యతిరేకంగానే చెప్పాను. ఎందుకంటే 'నిర్ణయాలు తీసుకునే వయసు నాకు అప్పుడు లేదని' అనుకున్నాను. ఇప్పుడూ నేను నీ నిర్ణయానికి వ్యతిరేకంగానే చెపుతున్నాను. ఎందుకంటే, ఇప్పుడు కూడా నాది నిర్ణయాలు తీసుకునే వయసుకాదు. నాకు పెళ్లయింది. ఆరేళ్ల సంసార జీవితానికి ప్రతిఫలంగా ఇద్దరు పిల్లలు పుట్టారు. వారి భవిష్యత్ గురించి ఆలోచిస్తూ, నా గురించి బాధపడుతూ జీవితంలో సగం దూరం వచ్చేశాను. ఇటు చూడు.... అప్పుడే తెల్లవెంట్రుకలు మొదలైపోయాయి. ఇలా ఉన్న నేను నీతో పెళ్లికి ఒప్పుకుంటే, ఊరంతా ఈసడించుకుంటారు. జనం గురించి మనకెందుకనుకున్నా, నా బిడ్డల జీవితాల్లో ఊహించని మార్పులొస్తాయి. నీ జీవితంలోనూ అదే జరుగుతుంది. కాబట్టి.... జీవితాలనే మార్చే నిర్ణయాన్ని, ఈ వయసులో తీసుకోవడం మంచిది కాదు..... నన్ను క్షమించు....."



పుష్కరకాలం క్రితం ఆమె పెద్దల గురించి ఆలోచించింది. నేడు తన పిల్లల గురించి యోచిస్తోంది. అందుకే కాలం మారినా! జవాబు మారినా..... అర్థం అదే! నిర్ణయమూ అదే!!

చాలాసేపటి తర్వాత ఆశను కలిగించుకుంటూ అడిగాను. "నీ నిర్ణయం మారదా?"

ఆమె తల అడ్డంగా ఆడిస్తూ చెప్పింది. "చూడు శీనూ! కొందరి జీవితాలు త్వరగా ప్రారంభమై మధ్యలో ఆగిపోతాయి. ఆ తర్వాత వారికి జీవితం ఉండదు. బరువు, బాధ్యతల్లోనే ఆనందం వెతుక్కోవాలి. మరికొందరి జీవితాలు ఆలస్యంగా ప్రారంభమై ఆగకుండా ముందుకు సాగుతాయి. నీకు సరికొత్త జీవితం ఇప్పుడే ప్రారంభమైంది. ఎవరి కోసమూ ఆగకు. ముందుకు సాగు..... అదే నాకు ఆనందం.... అదే ఈ జీవితానికి సంతృప్తి. నీ విజయం వెనుక ఉండే స్ఫూర్తి నేను అని తలచుకున్నప్పుడల్లా ఈ జీవితానికి ఇది చాలు.... అనిపించే గొప్ప సంతృప్తి...."

వనజ గురించి నాకు తెలుసు. ఆమె మనసు మార్చడం అంత సులభం కాదు. అంతకన్నా ముఖ్యంగా నా మనసులోకి తొంగి చూసుకుంటే, "ఆమె మాటల్లోని సత్యం నాకు బోధపడుతోంది. నిజమే నా జీవితం ఇప్పుడే ప్రారంభమైంది. ఎన్నో శిఖరాలు అధిరోహించాలి. మరెన్నో ఆనందాలు అందుకోవాలి.. సుఖాలు పొందాలి. వనజ సహచర్యంతో ఇది సాధ్యమా?...."

ఇప్పటి వరకూ నేను తెలుసుకున్న జీవిత సత్యం, ఊహకు, వాస్తవానికి మధ్యనున్న తేడాను మనసుకు తెలియజెపుతోంది.

మరి.... మరి మనసులో చిన్న అనుమానం.

"ఊహకు, వాస్తవానికి తేడా తెలిసిన నేను, ఈ పెళ్లి ప్రపోజల్ని ఆమె ముందు ఎందుకుంచాను?"

నాలో నేనే నవ్వుకున్నాను. "నా ఈగో సంతృప్తిపరచుకోవడం కోసమేనేమో. చిన్ననాడు అందుకున్న తిరస్కారానికి బదులుగా నా సక్సెస్ని ఆమెను తెలియజేయడం.... ఆమెను పరీక్షించడం నా మనసులోని భావం కావచ్చు...." కానీ అదే నిజమైతే మనసుకి నచ్చిన తొలినెచ్చెలి వనజ. ఆ స్థానం ఆమెకే పదిలం."

## ఐశ్వర్య ఏమంటోంది?

అభిషేక్‌తో ఐశ్వర్య పెళ్లయి దాదాపు పది నెలలు కావస్తోంది. మరో రెణ్ణెల్లలో వారి వెడ్డింగ్ యానివర్సరీని కూడా జరుపుకుంటారు. 32 ఏళ్లు నిండాక పెళ్లికూతురైన ఐశ్వర్య- జీవితంలో పెళ్లి అనే ఘట్టం ఎంతో ముఖ్యమైంది అంటోందిప్పుడు. 'ప్రతివారూ వివాహంలోని ఆనందాన్ని చవిచూడాలని నేను అంటాను' అంటుంది ఐశ్వర్య. 'భార్యాభర్తల మధ్య అనురాగం, ఆప్యాయతలు, సరదాలు.. లాంటివి అనుభవిస్తేనే ఆ జీవితానికి పరిపూర్ణత అంటున్న ఐశ్వర్య మరి పిల్లల్ని కనడమే తరువాయి. ఇంక అప్పుడేం ఉపదేశిస్తుందో చూడాలి!